ప్రజాశక్తి
బుధవారం 23 నవంబర్ 2022
5
అనంతపురం

కలెక్టరేట్ వద్ద ధర్నాలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

వేతనాలిస్తే చాలన్న దుస్థితికి తెచ్చారు..!

- ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వ తీరు దుర్మార్గం
- సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాలి
- యుటిఎఫ్ ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు హక్కులు, సౌకర్యాలు అమలు చేయాలని కోరే పరిస్థితి నుంచి చేసిన పనికి నెలవారీ వేతనాలు సకాలంలో ఇస్తే చాలన్న దుస్థితికి ప్రభుత్వ పాలకులు తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ధీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాకు ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ హాజరై మాట్లాడారు. ఉద్యోగులు పిఎఫ్ కోసం దరఖాస్తు చేసుకుని నెలల తరబడి కావస్తున్న డబ్బులు చేతికందని దుస్థితి రాష్ట్రంలో లేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని గొంతెత్తితే పోలీసులతో అక్రమ అరెస్టులు, నిర్బంధాలకు ప్రభుత్వం గురి చేయడం అన్యాయంగా ఉందన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు జి.ఓబులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడిదారీ, పెత్తందారీ విధానాలు అనుసరిస్తూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని తెలిపారు. కేవలం కార్పొరేట్ కంపెనీలే లాభపడుతున్నాయని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రం పట్ల వివక్ష చూపుతోందన్నారు. దాన్నీ వ్యతిరేకించి ప్రజలను కలుపుకుని పోరాడాల్సిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోదీకి మోకరిల్లుతూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. ప్రశ్నించేందుకు అధికార, ప్రతిపక్షాలు మోదీ దాసోహంగా వ్యవహరించడం సిగ్గుచేటుగా ఉందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందన బట్టి భవిష్యత్ పోరాటాలు చేపడతామన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ పోరాటాల నేపథ్యంలో యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలపై ప్రభుత్వం కేసులు, నోటీసులు జారీ చేసి ఆందోళనలో నెట్టి వేయాలని చూడడం సరికాదన్నారు. యుటిఎఫ్ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, కె.నాగేంద్ర మాట్లాడుతూ శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెబుతూనే ఉద్యోగులు వారి వేతనాల్లోంచి దాచుకున్న సొమ్మును ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ఏమిటని నిలదీశారు. సిపిఎస్ రద్దు చేస్తామని, జిపిఎస్ తీసుకురావడం కార్పొరేట్ కంపెనీలకు దాసోహం చేయడమే అవుతుందన్నారు. ఈ విధానాలపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, ప్రజా సంఘాల మద్దతును కూడకట్టుకుని ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ ధర్నాకు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, రెండు జిల్లాల కోశాధికారులు రాఘవేంద్ర, సుధాకర్, జిల్లా గౌరవ అధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, శ్రీనివాసులు, తాహీర్‌వలి, హరిక్రిష్ణ, హనుమంతరెడ్డి, అర్జున్, రఘురామయ్య, రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ప్రగతి

- ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్
- సంబరంగా సత్యసాయి యూనివర్సిటీ 41వ స్నాతకోత్సవం
- 22 మందికి బంగారు పతకాలు

భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమోఘమైన ప్రగతి సాధించిందని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ సోమనాథ్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి సత్యసాయి యూనివర్సిటీ 41వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం నాడు సాయి కుల్వంత్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి విద్యార్థులు మార్చ్ ఫాస్ట్‌తో సభా వేదికకు చేరుకున్నారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఇస్రో ఛైర్మన్ ప్రసంగించారు. అనంతరం విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 22 మంది విద్యార్థులకు బంగారు పథకాలు, 17 మందికి పిహెచ్‌డి పట్టాలు, 486 మందికి ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు.

వార్త మెయిన్‌లో..

విద్యార్థికి బంగారు పతకాన్ని అందిస్తున్న ఇస్రో ఛైర్మన్ డా॥సోమనాథ్ (ఇన్‌సెట్‌లో స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న ఇస్రో ఛైర్మన్)

60 ఏళ్ల తరువాత అత్యధికం

◆ తుంగభద్రకు ఈ ఏడాది 597.62 టిఎంసిలు ◆ 1961-62 తరువాత ఆదే అత్యధికం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం, కర్నూలు జిల్లాకు సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తున్న తుంగభద్ర డ్యామ్‌కు 60ఏళ్ల తరువాత అత్యధికంగా ఈ ఏడాది నీరొచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు డ్యామ్‌కు 597.62 టిఎంసిల నీరు వచ్చింది. ఇంత పెద్దఎత్తున ఈ 60 ఏళ్లలో చూస్తే ఇది రెండోసారి కావడం గమనార్హం. 1961-62 సంవత్సరంలో డ్యామ్‌కు అత్యధికంగా 677.730 టిఎంసిల నీరు లభ్యమైంది. ఆ తరువాత నుంచి అత్యధికంగా ఒక్క ఏడాదిలో నీరు అధికంగా రావడం ఇది రెండోసారి. సుమారు 157 రోజులుగా నీరు డ్యామ్ నిండి దిగువకు పోయింది. ఇంత పెద్దఎత్తున నీరు దిగువకు పోయినా అనంతపురం జిల్లాకు అదనంగా జరిగిన ప్రయోజనమేమీ లేదనే చెప్పొచ్చు. సాధారణంగా వచ్చేంత నీటిని మాత్రమే తీసుకోవడం జరిగింది.

నీటి నిలువలేక వృథాగా దిగువకు...

తుంగభద్ర డ్యామ్ కిందనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో దామాషా పద్ధతిలో అనంతపురం జిల్లాకు 32.50 టిఎంసిల కేటాయింపులున్నాయి. దీనికి అదనంగా కెసి కెనాల్ డైవర్షన్ ద్వారా మరో పది టిఎంసిలు కేటాయించారు. మొత్తంగా జిల్లాకు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా 42.50 టిఎంసిల నీరు జిల్లాకు తీసుకోవాల్సి ఉంది. వరద సమయంలో అదనంగా తీసుకుని ఉంటే మరింత నీటిని జిల్లాకు తీసుకోవచ్చు. అయితే పాలకులకు సరైన చిత్తశుద్ధి లేక ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లో ఉంచడంతో ఎక్కడి పనులక్కడే ఆగిపోయాయి. దీంతో అవకాశమున్నా నీటిని ఈ ఏడాది కూడా 30 టిఎంసిలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. ఇంకా అదనంగా 12 టిఎంసిలు తీసుకునే అవకాశమున్నా ఆ నీటిని నిలువ చేసుకునే వీల్లేక వదులుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

ప్రాజెక్టులు పూర్తయి ఉంటే...

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా పిఎబిఆర్ డ్యామ్‌కు నీటిని తీసుకునే అవకాశముంది. ఇది తీసుకోవడానికి ప్రధాన కాలువ ఆధునీకరణ పనులు మధ్యలో ఆగిపోవడం మొదటి అవరోధంగా ఉంది. ఎంత నీరున్నా రెండు వేల క్యూసెక్కుల లోపే నీరు కాలువలో తీసుకోవడానికి వీలుంది. ఒకవేళ తీసుకున్నా నిలువ చేసుకోవడానికి పిఎబిఆర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉన్నా... పూర్తి సామర్థ్యంతో నీరు నిలువ చేయడం సాధ్యపడటం లేదు. ఇప్పటికీ ఈ రిజర్వాయరు ముంపు ప్రాంతాలకు పరిహారం చెల్లించలేదు. మరోవైపు ప్రాజెక్టు మొత్తం లీకేజీలతో ఉంది. దీంతో 11 టిఎంసిలు నిలువ చేయాల్సిన చోట ఐదు టిఎంసిలతోనే సరిపెట్టాల్సి వస్తోంది. దీనికి జియోమెంబ్రైన్ చేస్తే పూర్తి సామర్థ్యంతో నిలువ చేయవచ్చునని ఇంజినీర్లు చెబుతున్నా ప్రభుత్వం అటువైపుగా ఆలోచించడం లేదు. దీంతో ఇక్కడ ఆరు టిఎంసిలు అదనంగా నిలువ చేసుకునే అవకాశాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఇక గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించిన ఉంతకల్లు రిజర్వాయర్ ఐదు టిఎంసిలతో ప్రతిపాదించారు. ఇది డిపిఆర్ తయారీ దగ్గరే ఆగిపోయింది. ఇది అనుకున్న విధంగా పూర్తి చేసి ఉంటే ఇక్కడా మరో ఐదు టిఎంసిలు నీరు నిలువ చేయడానికి అవకాశం లభించేది. ఈ రకంగా పది టిఎంసిలు ఇప్పుడున్న వనరులతోనే నిలువ చేసుకునే అకాశముండింది. కాని సరైన సమయంలో పాలకులు నిర్మాణాలు చేపట్టకపోవడంతో నీరు తీసుకోలేకపోవడం జరిగింది.

నర్సుల సేవలు వెలకట్టలేనివి

ఐద్వా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి నర్సులకు సన్మానం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఆసుపత్రి నర్సులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. మంగళవారం నాడు ఐద్వా కాకినాడ జిల్లా కమిటీ సభ్యురాలు భర్త లక్ష్మినారాయణ అనంతపురం విచ్చేసిన సందర్భంగా రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అక్కడున్న వారు ఆయన్ను చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. వెంటనే ఆసుపత్రిలోని స్టాఫ్‌నర్స్ శ్రీదేవి, నిర్మల, శ్రీవిద్య, వెంకటేష్‌లు ఆయనకు వైద్య సేవలు అందించారు. గాయపడిన వ్యక్తి సమాచారాన్ని సోషియల్ మీడియా ద్వారా కుటుంబ సభ్యులకు అందేలా చూశారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అనంతపురం ఐద్వా జిల్లా కమిటీ నాయకులకు తెలిపారు. వెంటనే వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మినారాయణను పరామర్శించారు. సకాలంలో వైద్య సేవలు అందించిన నర్సుల సేవలను కొనియాడుతూ సన్మానించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ బంధాలు, బంధుత్వాలు, మానవ సంబంధాలు నిర్వీర్యం అవుతున్న రోజుల్లో ప్రభుత్వ వైద్య సిబ్బంది చేస్తున్న సేవలు అమోఘంగా ఉన్నాయని తెలిపారు. నిస్వార్థంతో ప్రజల ప్రాణాలు కాపాడేందుకు చేస్తున్న కృషి మరిచిపోలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యచంద్రయాదవ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సును సన్మానిస్తున్న ఐద్వా నాయకురాళ్లు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కుందుర్పి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కలిగొలిమి, అప్పాజి పాళ్యం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సిఎం జగన్ నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసమే పని చేస్తున్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పలువురుకి ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. అంతకుముందు రెవెన్యూ అధికారులు సమయపాలన పాటించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 11:30 అవుతున్నా కార్యాలయానికి రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాధర, ఎంపి కమల నాగరాజు, జడ్పిటిసి రాధాస్వామి, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, వాల్మీకి సంఘం రాష్ట్ర డైరెక్టర్ పాలాక్షి, కురుబ సంఘం మండల అధ్యక్షులు కెపి గోపాల్, కోఆప్షన్ సభ్యులు ముజీవులా, సింగల్‌విండో ఛైర్మన్ వన్నూరురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని 11వ వార్డులో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విప్ కాపు రామచంద్రారెడ్డి హాజరై ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ గౌని ఉపేంద్రరెడ్డి, వార్డు సభ్యులు లావణ్య, సచివాలయ ఉద్యోగులు, వైసిపి పట్టణ కన్వీనర్ ముస్తాక్, నాయకులు శివ, శ్రీరామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

మాజీ మంత్రి పరిటాల సునీత

ప్రజాశక్తి-రాప్తాడు

రైతుల పండించే పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ మంత్రి పరిటాల సునీత డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గాండ్లపర్తి గ్రామం నుంచి రాప్తాడు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళలు, రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. ముఖ్యంగా అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రాజెక్టులు కట్టి పిల్లకాలువలతో నీళ్లు వదులుతామని చెప్పిన నాయకులు మూడేళ్లు పూర్తయినా పునాదులు కూడా తీయలేదన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి తమపై విమర్శలు చేయడం తప్ప అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం విత్తనాలు, ఎరువుల రేట్లు పెంచి రైతన్నల నడ్డి విరుస్తోందన్నారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని, అప్పుడు తప్పకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు టిడిపి ఇన్‌ఛార్జి ధర్మవరపు మురళీ, కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తెలుగు రైతు గోపాల్, సర్పంచి నరేష్, నారాయణస్వామి, రామకృష్ణ, గంగలకుంట రమణ, ఎ.రామనాథ్, శ్రీనివాసులు, నాగేష్, సత్యమయ్య, కృష్ణమోహన్, లోకేష్, రామానాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

వ్యకాసం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అనంతపురం కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం 7వ జిల్లా మహాసభలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా సూరి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎం.క్రిష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా కష్ణనారాయణ, మల్లేష్, సహాయ కార్యదర్శిగా భాస్కర్, సోమశేఖర్, కోశాధికారిగా మున్నీ, జిల్లా కమిటీ సభ్యులుగా రామాంజనేయులు, సుంకన్న, ఓబులేసు, పెద్దయ్య, మద్దిలేటి, భాస్కర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, పేదలు, ఉపాధి హామీ కూలీల తరపున వ్యకాసం నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు.

వ్యకాసం నూతన జిల్లా కమిటీ సభ్యులు

సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, ఆర్‌కె.రోజా

గుర్తుండిపోయేలా సత్యసాయి శతజయంతి ఉత్సవాలు

- కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి
- ఆకట్టుకున్న సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షో

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్యసాయి బాబా 97వ జయంతోత్సవాలు ప్రస్తుతం జరుగుతున్నాయని, దీనికి కొనసాగింపుగా బాబా శతజయంతి ఉత్సవాలు భవిష్యత్తు తరాలకు గుర్తిండిపోయేలా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. మంగళవారం రాత్రి పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె.రోజాతో కలిసి ప్రారంభించారు. సత్యసాయి బాబా జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోని ప్రజలు, పర్యాటకులు తిలకించారు. ఈ సందర్భంగా కేంద్ర ఆయన మాట్లాడుతూ బాబా శతజయంతి ఉత్సవాలను అద్భుతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున తాము కూడా ఇందులో భాగస్వామ్యం అవుతామన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం తరపున సౌండ్ అండ్ లైట్, మల్టీమీడియా షోని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బసంత్ కుమార్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, కేంద్ర నెహ్రూ యువకేంద్రం (ఎన్ వై కెఎస్) వైస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ ఛైర్పర్సన్ ఓబులపతి, ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, మాజీ మంత్రులు గీతారెడ్డి, పల్లె రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలిసిన ప్రముఖులు

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మంగళవారం మధ్యాహ్నం పట్టపర్తికి చేరుకున్నారు. రాజకీయ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను కలిశారు. పుట్టపర్తి విమానాశ్రయంలో ఈయనకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కలెక్టర్ బసంత్ కుమార్, ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు, కేంద్ర నెహ్రూ యువకేంద్రం (ఎన్‌వైకెఎస్) వైస్ ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతన్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యుడు చలం, పుడా ఛైర్మన్ లక్ష్మీనరసమ్మ, ఇన్‌ఛార్జి డిఆర్ఓ భాగ్యలక్ష్మి తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పుట్టపర్తిని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి చేయూతను ఇన్తుందన్నారు. పుట్టపర్తి ప్రాంత ప్రజలకు బాబా జీవిత విశేషాలను తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన లైట్ అండ్ లేజర్ షోను బాబా భక్తులకు అంకితమిస్తున్నట్లు ఆయన తెలిపారు.

పుట్టపర్తి విమానాశ్రయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి
www.prajasakti.com

26న ప్రత్యేక హోదా కోరుతూ చలో ఢిల్లీ

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, విద్యార్థి యువజన సంఘాల జెఏసి ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరమేష్, సూర్యచంద్రయాదవ్ తెలిపారు. మంగళవాం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు, సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు, పోలవరం ప్రాజెక్టు నిధులు కేటాయించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఉప సంహరించాలని కోరుతూ ఢిల్లీలో ఆందోళనలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 26న ఢిల్లీ నడిబొడ్డున పార్లమెంట్ దద్దరిల్లే విధంగా చలో పార్లమెంట్ మార్చ్‌పాస్ట్‌కు వేలాదిగా విద్యార్థులు, యువత తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, అశోక్, సంజీవ్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, విద్యార్థి యువజన సంఘాల జెఏసి ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరవింద్, ధనుష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు, సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంతోపాటు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ పార్లమెంటు వద్ద ధర్నాకు పిలుపునిచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల సహాయ కార్యదర్శి ఆదర్శ్, నాయకులు పవన్, అరవింద్, మతేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

శింగనమల : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు, సెంట్రల్ యూనివర్సిటీకి నిధులు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాల జెఏసి ఆధ్వర్యంలో ఢిల్లీ నడిబొడ్డున ఉన్న పార్లమెంట్ దద్దరిలేవిధంగా చలో పార్లమెంట్ మార్చ్‌పాస్ట్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఉరవకొండ : చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సిద్దార్థ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పట్టణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు వంశీ, గౌతమ్, కార్యదర్శి సింహాద్రినాయక్, కార్యవర్గసభ్యులు రజనీకాంత్, బన్నీ, ఉదయ్, కిరణ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఏపికి రాష్ట్ర ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల జెఏసి ఆధ్వర్యంలో ఈనెల 26న నిర్వహించనున్న చలో పార్లమెంట్ (ఢిల్లీ) కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సి.రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వివిధ కళాశాలల్లో విద్యార్థులతో సమావేశమై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గౌతమ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన చలో ఢిల్లీకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బంగి శివ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు వంశీ, గౌతమ్, ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్ రాము తదితరులు పాల్గొన్నారు

విద్యార్థినులకు క్రీడా సామగ్రి పంపిణీ

గుత్తి : ఆర్ఎస్ లోని విద్యార్థినులకు ఆర్డీటీ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏవిఆర్ పాఠశాల ప్రిన్సిపాల్ జానీ, పిఈటి, ఆర్డీటి కోచ్ ఈద్రీష్ బాషా పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని పెద్దకొట్టాలపల్లి, ఎన్.తిమ్మాపురం గ్రామాల్లో ఎఇఒ రాఘవేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం పత్తి పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో, విఇఒ, రిలయన్స్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘం పరిధిలోని 3, 4, 5, 9, 12, 18వ సచివాలయాలకు సంబంధించి ఖాళీగా ఉన్న వాలంటీర్ల పోస్టులకు ఈనెల 30వతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

రాయదుర్గం : కళ్యాణదుర్గం సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని డీఎస్పీ బి.శ్రీనివాసులు తెలిపారు మంగళవారం సాయంత్రం రాయదుర్గం పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డివిజన్ పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను పకడ్బందీగా అరికడతామన్నారు. అనంతరం గుమ్మఘట్ట మహిళా పోలీసులతో సమావేశమై ఏ విధంగా విధులు నిర్వర్తిస్తున్నారు.. సమాచారం ఎలా సేకరిస్తున్నారు.. సమస్యలేమైనా ఉన్నాయా.. అని ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ పోలీస్ ఇన్స్‌పెక్టర్ యుగంధర్ పాల్గొన్నారు.

24న సర్వసభ్య సమావేశం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 24న సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యాదవేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ సమస్యలపై సమావేశంలో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఏర్పాటు

రాయదుర్గం : ఎమ్మార్పీఎస్ గుమ్మగట్ట మండల కమిటీ నూతన కార్యవర్గం మంగళవారం ఏర్పాటైంది. జిల్లా కన్వీనర్ హరిగోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం రాయదుర్గంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో మండల సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గుమ్మగట్ట మండల గౌర వాధ్యక్షులుగా తిప్పేస్వామి, అధ్యక్షులుగా రూపేష్, ఉపాధ్యక్షులుగా హనుమంతు, భీమరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సతీష్, అధికార ప్రతినిధిగా దేవరాజు, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, కార్యదర్శిగా ఆనంద్, లక్ష్మన్న, ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

IN THE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE:ANANTHAPURAMU
O.S.No:30/2019.

Between:
V.Latha ... PLAINTIFF
V/S
G.Narayanamma ... DEFENDANT

NOTICE TO DEFENDANT

TO
G.Narayanamma W/O Raghav, D.No:1/51, oc colony, Raketla Village, Beluguppa Mandal, Ananthapura Dist.

పై నెంబరు దావా లోని ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు 25-11-2022 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లేక వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములను తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని యెడల పై దావా మీ పరోక్షము నందు తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
M.VISHNUVARDHAN REDDY,
Advocate, Ananthapuramu, Cell:9440286591

టిడిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

గత టిడిపి ఐదేళ్ల పాలనలో నగరంలో జరిగిన అభివృద్ధి శూన్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని 20వ డివిజన్‌లో కార్పొరేటర్ లావణ్యతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఇందులో భాగంగా సంక్షేమ పథకాలను వివరిస్తూనే.. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక సంక్షేమంతో పాటు అభివద్ధిని శరవేగంగా తీసుకెళుతున్నట్లు తెలిపారు. తాము గడప గడపకూ వెళ్తున్న సమయంలో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకుకొస్తే దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రెయినేజీలు, రోడ్ల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో పాటు జనరల్, ప్రత్యేక ఫండ్స్ నుంచి నిధులు కేటాయించి పనులు చేపడతామన్నారు. సంక్షేమం, అభివృద్ధి శరవేగంగా సాగుతుంటే భవిష్యత్‌లో అధికారంలోకి రాలేమని తెలిసి ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజల సంక్షేమం కోసం చేసిందేమీ లేదన్నారు. 2014లో అధికారంలోకి వచ్చాక విభజన హామీలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. పోలవరం, ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు సాధించుకునే విషయంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. ఆనాడు తన వ్యక్తిగత, స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారన్నారు. తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల వల్ల ఒరిగిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఫయాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, నగర పాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-గుత్తి

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు కోరారు. మంగళవారం రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అధ్యక్షుడు వై.రాజశేఖరరెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఎయిమ్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలన్నారు. గుంతకల్లు రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని కోరారు. 400 టీఎంసీల నికర జలాలు కేటాయించాలన్నారు. హార్టికల్చర్, అగ్రికల్చర్ యూనివర్సిటీ, మినీ సెక్రటరీయేట్, ఒకసారి అసెంబ్లీ రాయలసీమలో జరపాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి త్వరలో అన్ని ప్రజాసంఘాలు విద్యార్థుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాండ్లపాటి విశాలాక్షి, గేట్స్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, శ్రీసాయి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, ఎపి ఎమ్మార్పీఎస్ నాయకుడు కాశీరావు, జనవిజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు గురుశంకర్, న్యాయవాది గంగాధర్‌కుమార్, సిపిఎం నాయకుడు యు.మల్లికార్జున, సిపిఐ మండల కార్యదర్శి రామదాసు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, జ్ఞానేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సిఎం జగన్.. నోరు అదుపులో పెట్టుకో...

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేసేటప్పుడు సిఎం జగన్ నోరు అదుపులో పెట్టుకోవాలని జనసేన జిల్లా అధ్యక్షులు టీసీ వరుణ్, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ జనసేన పార్టీని రౌడీసేన అని వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందన్నారు. వైసిపి పార్టీ నిండా ఆకురౌడీలు, అల్లరి మూకలు, గూండాలు, హత్యకేసుల్లో నిందితులు, ఆర్థిక నేరాల్లో ఆరితేరిన వారిని వెంటబెట్టుకుని తమపై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. జనసేనను ఎదుర్కోవాలంటే దమ్ము ధైర్యం ఉండాలన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, ముప్పూరి కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న జనసేన పార్టీ నాయకులు

ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం

ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ఉరవకొండ : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల వస్తువులపై విపరీతంగా ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తోందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ విమర్శించారు. మంగళవారం మండలంలోని నింబగల్లు గ్రామంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై అన్నివర్గాల ప్రజల్లో కూడా తీవ్రంగా వ్యతిరేకత ఉందన్నారు. ఇకపోతే శ్రీశైలం జలాశయంలో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉన్నా హంద్రీ-నీవా కాలువకు నీరు విడుదల చేయించడంలో అధికారులు, నాయకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. డిసెంబర్ నెలలోనే హంద్రీ-నీవా కాలువకు నీటిని నిలుపుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గతంలో ఫిబ్రవరి చివరి వరకు హంద్రీనీవాకు నీరు వచ్చేదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక నీటి విడుదలలో వైఫల్యం చెందిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫిబ్రవరి చివరి వరకూ నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయభాస్కర్, నింబగల్లు టిడిపి నాయకులు సిద్ధప్ప, ఆదినారాయణ, దాము, అన్వేష్, నూతన్, వెంకటేశులు, గోవిందు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా 'ఉపాధి' సామాజిక తనిఖీ

బుక్కరాయసముద్రం : మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద 2020-21, 2021-22 వరకు జరిగిన ఉపాధి హామీ, అనుబంధ శాఖల పనులకు సంబంధించి మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదిక సామాజిక తనఖీ సాదాసీదాగా ముగిసింది. ఇందులో భాగంగా డ్వామా అదనపు పీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామాల వారీగా చేపట్టిన ఉపాధి పనులను సమీక్షించారు. మేట్ల హాజరు, కూలీల హాజరు పట్టికలు, పనులు జరిగిన చోట అంచనా పనుల బోర్డుల ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించారు. అలాగే చెల్లించాల్సిన బిల్లు కంటే ఎక్కువ చెల్లించినందుకు రూ.30వేలు, రూ.2,18,660 రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి డి.సునీత, జడ్పిటిసి నీలం భాస్కర్, ఎంపిడిఒ తేజోష్ణ, ఎపిడి అనురాధ, సర్పంచు పార్వతి, పసులూరు సర్పంచు కల్పన, స్టేట్ రిసోర్స్ పర్సన్ విజయ్‌భాస్కర్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలి

బుక్కరాయసముద్రం : అంగన్‌వాడీల్లో చిన్నారులకు నాణ్యమైన భోజనం అందించాలని ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి సూచించారు. మంగళవారం మండలంలోని రేకులకుంట, అమ్మవారిపేట అంగన్‌వాడీ సెంటర్లను సిడిపిఒ ఉమాశంకరమ్మతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తప్పకుండా తమ చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలన్నారు. అలాగే ప్రతి పిల్లవాడు ఆరోగ్యంగా ఉండే విధంగా అంగన్‌వాడీలు బాధ్యతలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు భారతి, కౌసల్య, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డివైడర్ల సుందరీకరణతో నగరానికి నూతన శోభ

అనంతపురం కార్పొరేషన్ : డివైడర్ల సుందరీకరణ పనులు చేపట్టి నగరానికి నూతన శోభను తీసుకొస్తున్నట్లు మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. మంగళవారం నగరంలోని విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి జెఎన్‌టియు రోడ్డు ఉన్న రోడ్ డివైడర్ల సుందరీకరణ పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి జెఎన్‌టియు రోడ్డు వరకూ డివైడర్ల సుందరీకరణ పూర్తయిందన్నారు. రోడ్డు నిర్మాణంతోపాటు 1.67 కిలోమీటర్ల మేర రూ.27 లక్షలతో డివైడర్ల సుందరీకరణ పనులు చేపడుతున్నామన్నారు. ఆకర్షణీయమైన పూలు, ఇతరత్రా డిజైన్‌లతో పనులను చేస్తున్నట్లు వివరించారు. అంతేగాకుండా డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇషాక్, వైసిపి నేత ఖాజా, శీను, డిఇ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడి నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి

గుంతకల్లు : 15 రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన పేద ముస్లిం విద్యార్థిని షేక్ ముబీనా బేగం (13) ప్రభుత్వ వైద్యుడు రామాంజనేయులు నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యులను స్వగృహంలో కలిసి మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనపై జిల్లా వైద్యాధికారులు విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవడంతోపాటు మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుత్తి : మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం మామిడ్డి గ్రామానికి చెందిన ఉపేంద్ర (46) ఆటోలో వెళ్తుండగా బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ ఉపేంద్రను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బంగారు గొలుసు అపహరణ

గుత్తి : ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలు నుంచి మంగళవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు బంగారు గొలుసును అపహరించారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మిద్దె తండాకు చెందిన పద్మావతి ఆమె కుమార్తె పుష్ప గుంతకల్లు నుంచి అనంతపురం వెళ్లడానికి ఎపిఎస్ ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ఈనేపథ్యంలో పుష్ప మెడలో ఉన్న 1.5 తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు చోరీ చేసికెళ్లారు. గుత్తి సమీపం రాగానే జరిగిన బంగారు గొలుసు దొంగతనం తెలుసుకుని బాధితులు లబోదిబోమన్నారు. ఘటనపై పోలీసులకు తెలియజేయడంతో బస్సులో పోలీసులు సోదాలు నిర్వహించారు. బంగారు గొలుసు అపహరణపై చేపట్టారు.

స్వధర్మ ప్రచారయాత్రను జయప్రదం చేయండి : విప్ కాపు

రాయదుర్గం : నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి చేపట్టిన స్వధర్మ వాహిని యాత్రను జయప్రదం చేయాలని విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈయాత్రకు పట్టణప్రజలందరూ ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ మారుతి, వెంకటరమణస్వామి ఆలయ పాలకమండలి అధ్యక్షులు గౌని పాలాక్షిరెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు పరిధిలో పరీక్షల ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురము జెఎన్‌టియు పరిధిలో ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్-2022 సంవత్సరంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య ఇ. కేశవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా బీ.టెక్ రెండవ సంవత్సరం, ఒకటవ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్ష పలితాలు, ఎం.ఫార్మసీ ఒకటవ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్ష పలితాలు, ఎం.ఫార్మసీ రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

తాగునీటి సమస్య కోసం రోడ్డెక్కిన మహిళలు

ఆత్మకూరు : తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మహిళలు ధర్నా నిర్వహించారు. నెలరోజులుగా తాగునీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్‌పై విద్యార్థులకు అవగాహన

అనంతపురం : నగరంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్‌పై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ.రంగస్వామి మాట్లాడుతూ నేటి కాలంలో మైనర్లు ద్విచక్ర వాహనాలను ఎక్కువగా నడుపుతున్నారన్నారు. అంతేగాకుండా వారికి ట్రాఫిక్ పట్ల అవగాహన లేకపోవడం వల్ల అనేక అనార్థాలు జరుగుతున్నాయన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులకు ట్రాఫిక్‌పై అవగాహన అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య ఎటిపి-7 బ్రాంచ్ ప్రిన్సిపల్ పర్వీన్, పోలీస్ శాఖ డీన్ చంద్రమోహన్, ప్రైమరీ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సమస్యలపై గళం విప్పిన సభ్యులు..

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై గళం విప్పారు. ముందుగా మండల ఉద్యానవన అధికారి ఫజులన్నీసా మాట్లాడుతుండగా పండ్లతోటలకు పరిహారం అందుకున్న రైతుల సంఖ్య ఎంత.. డ్రిప్పు కావాల్సిన రైతులు ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి.. ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు.. అనే వివరాలు తెలపాలని సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, బండ్లపల్లి ఎంపిటిసి శంకర్‌యాదవ్ నిలదీశారు. దీంతోపాటు పలువురు సభ్యులు సమస్యలపై నిలదీశారు. గతంలో 'కూలిన ప్రహరీ'.. భయం గుప్పిట్లో బాలికలు అంటూ ప్రజాశక్తి వార్తాపత్రికలో వచ్చిన కథనంపై 1వ ఎంపిటిసి గువ్వల రమాదేవి.. నీలదీశారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిడిఒ దివాకర్, తహాశీల్దార్ నారాయణస్వామి, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా, సింగిల్‌విండో ఛైర్మన్ లోకనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ఆత్మకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని సర్పంచి ఎగ్గిడి వరలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా భోజనం నాణ్యతను పరిశీలించారు. అదేవిధంగా కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, ఎంఇఒ నరసింహారెడ్డి, పంచాయతీ సెక్రటరీ శైలజారాణి, సచివాలయం-1, మహిళా పోలీస్ షబానా, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి..

శింగనమల : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాల్సిందే అని రజకసంఘం పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సి.లింగమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రామాలయం నుంచి భారీగా ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవీ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రజకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అవమానాలు, గ్రామ బహిష్కరణలు, మహిళలపై వేధింపులు అధికమయ్యాయన్నారు. వీటిని అరికట్టాలంటే తప్పకుండా రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు సి.పెద్దన్న, కన్వీనర్ దేవేంద్రప్ప, కో కన్వీనర్ కంబన్న, చంద్రశేఖర్, నాగేంద్ర, శ్రీరాములు, పరమేశు, హనుమన్న, కృష్ణమూర్తి, హరికృష్ణ, నాగప్ప, మండల నాయకులు రంగయ్య, చిదంబరప్ప, పెద్ద నాగేష్, బాలు, నారాయణప్ప, జయరాం, రుద్ర పుల్లన్న పాల్గొన్నారు.

అభివృద్ధి కన్నా అక్రమాలే అధికం..

కళ్యాణదుర్గం : జగన్ సిఎం అయ్యాక రాష్ట్రంలో అభివృద్ధి కన్నా అక్రమాలే అధికమయ్యాయని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణ చూసి జగన్‌రెడ్డి వికృత చేష్టలు చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను వివరించేందుకు 'ఇదేం ఖర్మ.. మనరాష్ట్రానికి' అంటూ టిడిపి ఆధ్వర్యంలో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా టిడిపి ఉండేదని, వైసిపి అధికారంలోకి వచ్చాక అవినీతిమయంగా మారిందన్నారు. ప్రస్తుతం చంద్రబాబును చూసి జగన్‌కు వణుకు పుడుతోందన్నారు. జగన్ సైకోగా మారి ప్రజలకు శాపంగా మారాడు విమర్శించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : జెఎన్‌టియు విసి

అనంతపురం : క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం లభిస్తుందని జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధన అన్నారు. మంగళవారం స్థానిక జెఎన్‌టియులో అనుబంధ తైల సాంకేతిక, పరిశోధన సంస్థ (ఒటిపిఆర్ఐ) ఆధ్వర్యంలో కళాశాల అంతర్గత క్రీడా సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలను విసి అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా విసితోపాటు రెక్టార్ విజయకుమార్ శాంతి కపోతాలను ఎగురవేయడంతోపాటు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఒటిపిఆర్ఐ కళాశాల చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా క్రీడోత్సవాలను ఎంతో ఘనగా నిర్వహించడం పట్ల సంస్థ సంచాలకులు బి.దుర్గాప్రసాద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఒటిపిఆర్ఐ కళాశాల ప్రిన్సిపల్ సి.గోపీనాథ్, స్వరూప రాణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లింగప్ప, బోధన, బోధనేతర సిబ్బంది, యూనివర్సిటీ పిఆర్ఒ ఎం.రామశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

Government of Andhra Pradesh
TADIPATRI MUNICIPALITY
"e" Procurement Notice

1.	"e" Procurement Notices	93 to 95/2022-23/GENERAL/E1
2.	Works & Amount	(3 Nos) - Rs. 26.95 Lakhs
3.	Tender Download Starting Date	23-11-2022 at 10:00 A.M
4.	Last date / Time of receipt of Tender	07-12-2022 at 04:00 P.M
5.	Name and Address of concerned	Municipal Commissioner, Tadipatri

Further details can be see tender.apeprocurement.gov.in

Commissioner(FAC)
Tadipatri Municipality

టవర్‌క్లాక్ బ్రిడ్జి.. సుభాష్ రోడ్డు నిర్మాణంలో అవకతవకలను అరికట్టాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి టిడిపి నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలో నిర్మిస్తున్న టవర్‌క్లాక్ బ్రిడ్జి, సుభాష్ రోడ్డు నిర్మాణాల్లో చోటు చేసుకుంటున్న అవకతవకలను అరికట్టాలని టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం అవే సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వేస్తున్న రోడ్డు వంకర టింకరగా ఉందన్నారు. ఎవరి ప్రయోజనం కోసం ఇలా నిర్మిస్తున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో తొలగించిన ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహాన్ని వెంటనే ప్రతిష్ఠించాలన్నారు. అలాగే నగరంలో వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ సాకే గంపన్న, టిడిపి రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళి, జిల్లా అధికార ప్రతినిధులు సరిపూటి రమణ, నారాయణ స్వామి యాదవ్, అవే సంస్థ జిల్లా అధ్యక్షుడు బంగినాగ, మాజి రాష్ట్ర మేకలు గొర్రెల కార్పొరేషను డైరెక్టరు శివబాల, టిడిపి రాష్ట్ర నాయకులు గుజ్జల నాగభుషణ, స్వప్న, తేజస్వీణీ, హసీనా, ముక్తియార్, డాక్టర్ లక్ష్మీప్రసాద్, జెఎం,బాషా, గౌసియ, గోపాల్‌గౌడ్, మార్కెట్ మహేష్, పావురాల శేఖర్, సున్నం శీను, బెస్త పవన్, రంగ, హర్షవర్ధన్, బెస్త శంకర, తేజా రాయల్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న టిడిపి నేతలు

మీ కోసం

ఆమ్లెట్ పొంగినట్లు రావాలంటే, చిటికెడు పంచదార లేదా మొక్కజొన్న పిండి కలపాలి.

జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడమే ఓటమి.

చదువు విలువ



చరిత తొమ్మిదవ తరగతి చదువుతోంది. ప్రతి రోజూ అమ్మా నాన్నల దగ్గర గొడవ చేసి డబ్బులు తీసుకొని పాఠశాలకు వెళ్ళేది. తండ్రి సీతయ్య వ్యవసాయ కూలీ. రోజూ కూతురికి డబ్బులు ఇవ్వడం కష్టంగా అనిపించేది. పుస్తకాలు కొనాలి, పరీక్ష ఫీజు కట్టాలంటూ డబ్బులు తీసుకునేది. ఆ డబ్బులతో ఫ్రెండ్స్‌తో కలిసి దుబారా ఖర్చు చేస్తూ ఉండేది.

చరిత పాఠశాల బయట ఓ మర్రి చెట్టు కింద 70 ఏళ్ల వృద్ధుడు పొద్దస్తమానం పుస్తకాలు చదువుతూనే ఉండేవాడు. సాయంత్రం కాగానే పిల్లలకు పాఠాలు చెప్పేవాడు. ఇది గమనించిన చరిత ఒకరోజు పాఠశాలకు వెళ్తూ ఆ వృద్ధుడు దగ్గర ఆగింది. 'తాతా.. ఈ వయసులో కూడా మీరు పుస్తకాలు చదువుతారు ఎందుకు?' అని అడిగింది.

అమ్మా! నేను నీ వయసులో ఉన్నప్పుడు చదువు విలువ తెలియక చదువును నిర్లక్ష్యం చేశాను. స్నేహితులతో కలిసి పొలాల వెంట తిరిగాను. పెద్దయ్యాక ఊర్లోనే కూలీనాలీ చేసుకుంటూ బతికాను. కష్టాలు పడి నా పిల్లలను చదివించాను. వాళ్ళు జీవితంలో స్థిరపడ్డారు. చదువ విలువ తెలుసొచ్చింది. అందుకే ఇప్పుడు చదువుతున్నా. అర్థం చేసుకున్న విషయాలను పిల్లలకు బోధిస్తున్నా.' అన్నాడు.

తన తప్పును తెలుసుకున్న చరిత ఆ రోజు నుంచి తండ్రిని డబ్బులు అడగడం మానేసింది.ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లి బాగా చదువుకుంది. కూతురిలో వచ్చిన మార్పుకు సీతయ్య చాలా సంతోషించారు.

- ఖర్జూరపు సరిత , 9వ తరగతి,
మేళ్ళచెరువు,సూర్యాపేట,
63053 93291.



తేడాలు గుర్తించండి

పిల్లలూ! ఈ చిత్రంలో ఆరు తేడాలు ఉన్నాయి. అవి ఏంటో గుర్తించండి.

నేను గీసిన బొమ్మ

- సి. భవాని, టెక్ జూనియర్ కళాశాల, తాడిపత్రి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సమాజంలో మహిళలు రకరకాల రూపాల్లో హింసను ఎదుర్కొంటున్నారు. అలాంటి పరిస్థితులను ఎదుర్కొని జీవించడమే గొప్ప ధైర్యం. కోల్పోయిన జీవితాన్ని తిరిగి పొందడం అనేది మరింత సాహసం. డాక్టర్ మహాలక్ష్మి ఈ కోవకే చెందుతారు. వైద్యం అందిస్తున్న ఆమెపై జరిగిన యాసిడ్ దాడి మానసికంగా కుంగదీసింది. అయినా ఆత్మస్థైర్యంతో తిరిగి తన జీవితాన్ని నిర్మించుకోవడంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. చూపు లేదని నిరుత్సాహపడలేదు. వైద్యసేవలు అందిస్తూనే తనలాంటి బాధిత మహిళలకు అండగా నిలుస్తున్నారు.

చూపులేకపోయినా వైద్యం అందిస్తూ ...

కర్ణాటక, మైసూరుకు చెందిన మహాలక్ష్మి ఇరవై ఏళ్ల క్రితం డాక్టర్ పట్టా పుచ్చుకున్నారు. మంచి వైద్యురాలిగా పేరు తెచ్చుకోవాలన్న ఆశతో క్లినిక్ ప్రారంభించారు. శివబసవయ్య అనే వ్యక్తికి చెందిన భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. కొన్ని నెలలకు మరొక భవనానికి మహాలక్ష్మి ఆసుపత్రిని మార్చారు. తాను ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి ఇవ్వమని శివ బసవయ్యను అడగ్గా... అతడు లెక్కచెయ్యలేదు. ఆమెను బెదిరించాడు. 'డబ్బులు ఇవ్వను... ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ దుర్భాషలాడాడు. దాంతో మహాలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. అది సహించలేక అతను, ఆమె ఒంటరిగా ఉన్న సమయం చూసి యాసిడ్ దాడి చేశాడు. దీన్ని ప్రత్యక్షంగా చూసిన వారు కోర్టులో సాక్ష్యం చెప్పేందుకు వెనకాడారు. అయినా మహాలక్ష్మి వెనకడుగు వేయలేదు. ఆధారాలు సేకరించి నిందితుడికి శిక్షపడేలా చేశారు. ఈ క్రమంలో ఆమె ఎన్నో అవమానాలూ ఎదుర్కొన్నారు. ఆమె కుటుంబం అడుగడుగునా ఆమెకు అండగా నిలబడింది. ఆ ధైర్యమే ఆమెను తిరిగి మనిషిని చేసింది.

బలవంతులు మాత్రమే సమాజంలో జీవించగలరు. బలహీనులు రోజూ చస్తూ బతుకుతారు అన్న మాటలు ఆమెను నిత్యం వెంటాడసాగాయి. మహాలక్ష్మి శారీరకంగా, మానసికంగా నిత్యం జీవన పోరాటం సాగించారు. దాడి జరిగిన రోజు ఆమె అనుభవించిన బాధ, రోదన జీవితంలో మరిచిపోలేనిది. మంచినీళ్ల కోసం పెట్టిన కేకలు హృదయ విదారకం. కనీసం హాస్పటల్‌కు తీసుకెళ్లేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు. దూరంగా జనం ఉన్నా - అతను ఏం చేస్తాడోనన్న భయంతో ఆమె దగ్గరకు వచ్చే సాహసం చేయనీయలేదు.

యాసిడ్ వల్ల కళ్లు పోగొట్టుకున్న మహాలక్ష్మి ఇంటికే పరిమితమైంది. ఏడాది పాటు మంచం మీద ఉండిపోయారు. గాయాల నుంచి రక్తం కారుతూ, మంటలు వచ్చేవి. భరించలేక చాలారోజులు ఏడ్చారు. మానసికంగా కుంగిపోయారు. అదే సమయంలో ఆమె ఆలోచనల్లో పడ్డారు. తప్పు చేసిన వాడు బయట తిరుగుతున్నాడు.. ఏ తప్పూ చేయని నేనెందుకు ఇంట్లోనే ఉండాలి? కళ్లు పోతే ఏం చేయలేమా? సాధించలేమా? అన్న ప్రశ్నలు ఆమెను ఇంట్లో ఉండనివ్వలేదు. అక్కలు, అమ్మ సహాయంతో బయటకు అడుగు వేశారు. దాడిచేసిన వ్యక్తిపై తిరిగి కేసు పెట్టారు. కానీ జిల్లా కోర్టులో ఆమెకు నిరాశ ఎదురైంది. శివబసవయ్య నిర్దోషిగా బయటకు వచ్చాడు. దాంతో మహాలక్ష్మి నిందితునికి శిక్ష పడాలంటూ, తనకు న్యాయం చేయమని తర్వాత కర్నాటక హైకోర్టును ఆశ్రయించారు. పదేళ్ల సుదీర్ఘ న్యాయ పోరాటం చేయగా హైకోర్టు ఆ వ్యక్తిని దోషిగా నిర్ధారించి, మూడేళ్ల జైలు శిక్ష విధించింది.

తిరిగి చదువుకుని ...

కళ్లులేని కారణంగా వైద్యవృత్తిలో రాణించటం కష్టం.. నోటి ద్వారా అయినా ప్రజలకు వైద్యం చేయాలనుకున్నారు. ఎంఎస్సీ సైకాలజీలో చేరి, డిగ్రీ సాధించారు. అయితే, కాలిపోయిన ఆమె శరీరాన్ని చూసి చాలామంది భయపడిన సందర్భాలు ఆమెను బాధపెట్టాయి. 50 శాతం కాలిపోయిన ముఖానికి శస్త్రచికిత్సలు చేయించుకోవడం మొదలు పెట్టారు. అప్పుడు కూడా ఎంతో బాధను భరించారు. మొఖం, రెండు చేతులకూ 10 ఏళ్ల పాటు నెలల వ్యవధిలో 25 సార్లు శస్త్రచికిత్సలు చేయించారు. సైకాలజిస్టుగా తనకు తాను మొదట పేషెంట్‌గా ఫీలయ్యారు. జరిగిన దాడి నుంచి బయటపడేలా మనోధైర్యం తెచ్చుకున్నారు. మహాలక్ష్మి పట్టుదల, ప్రతిభను ప్రభుత్వం గుర్తించి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో ఉద్యోగ అవకాశం కల్పించారు. దాంతో తన దగ్గరకు వస్తున్న మానసిక రోగులకు కౌన్సిలింగ్ చేస్తూ, శారీరక ఆరోగ్యంపై ఏవిధంగా దృష్టి సారించాలో వివరిస్తున్నారు. ప్రతిరోజూ 60 – 80 మంది రోగులు ఆమె దగ్గరకు వస్తూ ఉంటారు. ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నానన్న తృప్తితో తనకు జరిగిన అన్యాయాన్ని మర్చిపోతున్నారు. కోవిడ్ సమయంలోనూ పేషెంట్లకు కౌన్సిలింగ్ చేశారు. టీకాల పంపిణీలో ఊరురా తిరుగుతూ క్యాంపెయన్‌లో పాల్గొన్నారు.

మహిళ సాధికారతకు కృషి

'మహిళలకు విద్య చాలా ముఖ్యం. నేను తిరిగి నిలబడ్డాను అంటే చదువుకోవడం వల్లే. ఆ సమయంలో నా కుటుంబం నాకు రక్షణగా నిలిచింది. వారి ఇచ్చిన ధైర్యంతోనే తిరిగి జీవితాన్ని ప్రారంభించా. మహిళలకు సమాజంలో ఎదురయ్యే దాడులు, వేధింపుల నుంచి బయటపడేందుకు బలమైన సహాయక వ్యవస్థను ప్రభుత్వాలు కల్పించాలి.' అంటారు మహాలక్ష్మి. ఇప్పుడామె ఎంతోమంది మహిళలకు ధైర్యవచనం. తన దగ్గరకు వస్తున్న మహిళల వ్యక్తిగత, గృహహింస విషయాలు తెలుసుకుని, వాటి నుంచి ఎలా బయటపడాలో చెబుతున్నారు. చదువుకోవాలనుకున్న వారికి సహాయం చేస్తున్నారు. యాసిడ్ దాడి బాధితులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారిలో స్ఫూర్తి నింపుతున్నారు. డాక్టర్ మహాలక్ష్మి ఎందరికో ప్రేరణగా నిలుస్తున్నారు.



బాసు వస్తుండే ...

బాబీ దర్శకత్వంలో హీరో చిరంజీవి నటిస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఇప్పటికే ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్ విడుదల చేసింది చిత్ర బృందం. ఇప్పుడు చిత్రంలో ఫస్ట్ సింగిల్ ప్రోమోను విడుదల చేసింది. పూర్తి పాటను 23న విడుదల చేస్తున్నట్లు పోస్టర్ విడుదల చేసింది. పాటలో పూర్తి మాస్ గెటప్‌లో చిరంజీవి కనిపించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతంతో 'బాసు వస్తుండే...' అని పాట ఆయన పాడారు. శృతిహాసన్ హీరోయిన్‌గా, చిరంజీవి తమ్ముడి పాత్రలో రవితేజ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల కానుంది.

'అవతార్ : ది వే ఆఫ్ వాటర్' కొత్త ట్రైలర్

'అవతార్' మొదటి పార్ట్ వచ్చిన పదమూడేళ్ల తరువాత రెండో పార్ట్ 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' డిసెంబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా నుంచి ఇటీవల ట్రైలర్ విడుదలైంది. అవతార్ సినిమాను ఈసారి వాటర్‌లో తెరకెక్కించాడు జేమ్స్ కామెరాన్. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ మంగళవారం నుంచి దేశవ్యాప్తంగా ప్రీమియం ఫార్మాట్‌లలో ఓపెన్ అయ్యాయి. 20వ సెంచరీ స్టూడియోస్ ఇండియా నిర్మించిన ఈ చిత్రం ఇంగ్లిష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళంలో విడుదల కానుంది.

సౌదీ సంచలనం

అర్జెంటీనాపై 2-1 గోల్స్‌తో రికార్డు గెలుపు

ఫిఫా ప్రపంచకప్

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022లో తొలి సంచలనం నమోదైంది. మంగళవారం జరిగిన గ్రూప్-సి లీగ్ మ్యాచ్‌లో సౌదీ అరేబియా జట్టు 2-1 గోల్స్ తేడాతో మాజీ ఛాంపియన్, టైటిల్ ఫేవరెట్ అర్జెంటీనాపై అనూహ్య విజయం సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన తొలి 10 నిమిషాల్లోనే అర్జెంటీనా సీనియర్ ఆటగాడు లియోనెల్ మెస్సీ పెనాల్టీని గోల్‌గా మలచడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో ప్రథమార్థం ముగిసే సమయానికి అర్జెంటీనా 1-0 ఆధిక్యతలో నిలిచింది. రెండో అర్ధభాగం 48వ నిమిషంలో సలేహ్ అల్ షెహ్రీ చేసిన గోల్‌తో సౌదీ అరేబియా 1-1తో స్కోరు సమం చేసింది. ఆ తర్వాత మరో ఐదు నిమిషాలకే సలేమ్ అల్ దవ్సారీ చేసిన గోల్‌తో సౌదీ అరేబియా ఆధిక్యంలోకి దూసుకుపోయింది. అయితే స్కోరును సమం చేసేందుకు అర్జెంటీనా ఆటగాళ్లు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అర్జెంటీనా ఫార్వర్డ్‌ల దాడులను సౌదీ అరేబియా గోల్ కీపర్, డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు. దాంతో మెస్సీ సేనకు భంగపాటు తప్పలేదు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో అర్జెంటీనా 3వ స్థానంలో ఉండగా... సౌదీ అరేబియా 51వ ర్యాంక్‌లో ఉంది. దీంతో వరుసగా 36 మ్యాచ్‌ల్లో గెలిచి ప్రపంచకప్‌లో అడుగుపెట్టిన అర్జెంటీనా జైత్రయాత్రకు ఈ మ్యాచ్‌తో సౌదీ అడ్డుకట్ట వేసి రికార్డు నెలకొల్పింది.

అంతకుముందు జరిగిన గ్రూప్-ఏ లీగ్ మ్యాచ్‌లో అమెరికా-వేల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1గోల్స్‌తో డ్రా కాగా.. గ్రూప్-డిలో డెన్మార్క్-ట్యూనీషియా మ్యాచ్ 0-0తో డ్రా అయ్యాయి. సోమవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ జట్టు 2-0గోల్స్ తేడాతో సెనెగల్‌ను ఓడించింది. నెదర్లాండ్స్ 2గోల్స్‌ను మ్యాచ్ ముగియడానికి 10నిమిషాల ముందు చేయడం విశేషం. 84వ నిమిషంలో కోడే గక్పో 84వ ని.లో, 99వ నిమిషంలో గావీ క్లాసెన్ ఒక్కో గోల్ కొట్టారు. సెనెగల్ జట్టు 15సార్లు నెదర్లాండ్స్ గోల్‌పోస్ట్‌పై దాడులు చేసినా ఫలించలేదు.

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు..

గ్రూప్-డి: ఫ్రాన్స్ X ఆస్ట్రియా(మ.12.30గం॥లకు)
గ్రూప్-ఎఫ్: మొరాకో X క్రొయేషియా(సా.3.30గం॥లకు)
గ్రూప్-ఇ: జర్మనీ X జపాన్(రా.6.30గం॥లకు)
స్పెయిన్ X కోస్టారికా(రా.9.30గం॥లకు)

విడాకుల వివాదంపైశ్రీకాంత్ స్పందన

తన సతీమణి ఊహకు విడాకులు ఇస్తున్నట్లు జరిగిన ప్రచారాన్ని సినీనటుడు శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 'ఊహకు నేను విడాకులు ఇస్తున్నట్లు పలు వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానళ్లలో ప్రచారం జరుగుతోంది. కొన్ని వెబ్‌సైట్లలో వచ్చిన ఫేక్ న్యూస్ చూసి ఊహ ఆందోళనకు గురైంది. ఆ ప్రచారంపై బంధువుల నుంచి ఫోన్లు వస్తుంటే వివరణ ఇచ్చుకోలేకపోతున్నాం. నాపై అసత్య ప్రచారం చేస్తున్న ఛానళ్లపై సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తా. నిరాధారమైన వదంతులు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి' అని శ్రీకాంత్ పేర్కొన్నారు.

సిరీస్ విజేత భారత్

ఆర్ష్‌దీప్, సిరాజ్‌కు నాలుగేసి వికెట్లు.. టైగా ముగిసిన మూడో టి20

నేపియర్: మూడు టి20ల సిరీస్‌ను టీమిండియా 1-0తో కైవసం చేసుకుంది. ఇరుజట్ల మధ్య మంగళవారం జరిగిన మూడో, చివరి టి20 టై అయ్యింది. వర్షం కారణంగా మ్యాచ్ నిలిచే సమయానికి టీమిండియా 9 ఓవర్లలో 4 వికెట్లకు 75 పరుగులు చేసింది. దీంతో డక్ వర్త్ లూయిస్ విధానం ప్రకారం ఇరుజట్ల స్కోర్లు కావడంతో మ్యాచ్ టై అయినట్లు రిఫరీ ప్రకటించారు. దీంతో మూడు టి20ల సిరీస్‌ను భారత్ 1-0తో కైవసం చేసుకుంది. తొలి మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా రద్దుకాగా.. రెండో టి20లో టీమిండియా 65పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మంగళవారం జరిగిన మూడో టి20లో న్యూజిలాండ్ టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగి 19.4 ఓవర్లలో 160 పరుగులకు ఆలౌటైంది. కాన్వే 59, ఫిలిప్స్ 54 అర్ధసెంచరీలతో రాణించారు. సిరాజ్, ఆర్ష్‌దీప్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. టి20ల్లో ఇద్దరు భారత బౌలర్లు నాలుగేసి వికెట్లు తీయడం ఇదే ప్రథమం కాగా.. ఆర్ష్‌దీప్ సింగ్ తృటిలో హ్యాట్రిక్‌ను మిస్ చేసుకున్నాడు. 161 లక్ష్యంతో బరిలో దిగిన టీమిండియా 9 ఓవర్ల వద్ద వర్షం రావడంతో మ్యాచ్‌కు నిలిచిపోయింది. మ్యాచ్ నిలిచే సమయానికి టీమిండియా గెలుపు 66 బంతుల్లో 86 పరుగులు చేయాల్సి ఉంది. కెప్టెన్ హార్దిక్ పాండ్యా (30 బ్యాటింగ్), దీపక్ హుడా (9బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఓపెనర్లు ఇషాన్ కిషన్ 10, రిషబ్ పంత్ 11, సూర్యకుమార్ 19, శ్రేయస్ 0 నిరాశపరిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సిరాజ్‌కు, సిరీస్ సూర్యకుమార్ యాదవ్‌కు లభించాయి.

స్కోర్‌బోర్డు(సంక్షిప్తంగా)

న్యూజిలాండ్ : 160ఆలౌట్, (కాన్వే 59, ఫిలిప్స్ 54, ఆర్ష్‌దీప్ 4/37, సిరాజ్ 4/17)
భారత్ : 75/4 (9 ఓవర్లలో)
(హార్దిక్ 30(నాటౌట్), సాంట్నర్ 1/5)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram - 515004, A.P State, Ph.08554 -290484, and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.42/2, Near Industrial Estate, Old VRL Transport Godown, Bellary Road, Anantapuram-515004, Editor : Bendi Tulasi Das, Ph.9490099275, email: editorprajasakthi@gmail.com, RNI Regd .No. APTEL/2019/78422